

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -సోమల: మండలంలోని మేనేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఆదివారం అక్రమంగా బొలోరో వాహనంలో తరలిస్తున్న 1640 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని 9 మంది పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కందూరు మార్గంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టగా బొలెరో వాహనంలో 30 బస్తాల పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ తనిఖీల్లో పట్టుబడ్డారని అక్రమ బియ్యం తరలింపులో తొమ్మిది మంది పాత్ర ఉన్నట్లు గుర్తించి వారిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మొహమ్మద్ నయాజ్, మున్వర్ భాష వీరి ఇద్దరు పలమనేరు కు చెందిన వారు కాగా మిగిలిన వారు కూడా రేషన్ బియ్యం అక్రమ రవాణాలో పాత్ర ఉందని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బాలచంద్రయ్య, పోలీసులు బుడ్డా నాయక్, ఫైజుద్దీన్,ఫాయజ్ పాల్గొన్నట్లు తెలిపారు.

వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలి

- రైతులపై దాడులు అరికట్టాలి
- రైల్వేల ప్రయివేటీకరణ ఆపాలి
- సిపిఎం, సిపిఐ నాయకుల నిరసన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చిత్తూరు రైల్వే స్టేషన్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేస్తామని చెప్పి హామీ ఇచ్చి ఆ హామీని అమలు చేయకపోవడంతో మరో పోరాటం చేస్తున్న రైతాంగంపై విచక్షణా రహితంగా ఢిల్లీలో దాడి చేయడం దుర్మార్గమని రైతులపై జరుగుతున్న దాడులకు నిరసన చేస్తున్నామని తెలిపారు. 14వ తేదీ ఢిల్లీలో భారీ ఎత్తున నిరసన చేపడుతామని దేశంలోని రైతాంగం ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు అందుబాటులో ఉంటున్న రైల్వేల ప్రైవేటీకరణ వేగవంతం చేసిందన్నారు. అందులో భాగంగా సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా ప్యాసింజర్ రైలును ఎక్స్‌ప్రెస్‌గా మార్చి భారీ స్థాయిలో టికెట్ రేట్లు పెంచడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేసి భవిష్యత్తు తరాలకు ఉపాధి అవకాశాల్లేకుండా చేయడం అన్యాయమన్నారు. అన్ని రకాల ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ దేశ సంపదను మొత్తం కార్పొరేట్ శక్తులైన ఆదానీ, అంబానీలకు కట్టబెట్టడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కొన్ని రకాల తాయిలాలు మాత్రం ఇస్తే సరిపోదని దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలకు ప్రమాదకరమైన వ్యవసాయ నల్ల చట్టాలను ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. రైతుల వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులపై దాడి చేస్తున్నారని, స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, దానికి వంత పాడుతున్న వైసిపి, టిడిపి, జనసేనలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జ్యోతి, లోకనాథం, ప్రసాద్, సిపిఐ నాయకులు గోపి , చంద్ర, రమాదేవి, బాలాజీ పాల్గొన్నారు.



వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీ నేతలు



ఏనుగుల గుంపు హల్‌చల్

- సోలార్ ఫెన్సింగ్ ధ్వంసం
- అరటి, మామిడి, చెరకు పంటకు నష్టం

ప్రజాశక్తి- ఐరాల: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజక వర్గం ఐరాల మండలం వేదగిరివారిపల్లి పంచాయతీ చుక్కావారిపల్లి గ్రామంలో 19 ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తోంది. గత రెండు రోజులుగా గ్రామశివారుల్లోని పంటపొలాల్లోని పంటలను తిని తొక్కి నాశనం చేస్తున్నాయి. గ్రామానికి చెందిన రైతులకు చెందిన అరటి, మామిడి, చెరకు పంటలతో పాటు అటవీ ప్రాంతం చుట్టూ ఉన్న సోలార్ ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాయి. ఏనుగుల వల్ల చేతికందిన పంట నష్టపోతున్నామని, దాదాపు 3 లక్షల రూపాయల మేర నష్టం వచ్చిందని తెలిపారు. ఏనుగుల భారీ సంఖ్యలో ఉండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు తిష్ట వేయడంతో అవి ఎప్పుడు పంటలపై, తమపై దాడి చేస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరిమి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అంతే కాకుండా అటవీ ప్రాంతంలో ఏనుగులు ధ్వంసం చేసిన సోలార్ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసి ఆదుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరారు.

వేసవి నేపథ్యంలో..

ఇంటర్వ్యూ...

జంతు రక్షణ చర్యలు ప్రారంభించాం..!

- సందర్శకులకు అన్ని రకాల సదుపాయాలు..
- జూ క్యూరేటర్ సెల్వంతో ప్రజాశక్తి ముఖాముఖి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో సందర్శనకు వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో జంతువుల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టారన్న అంశాలను ప్రజాశక్తితో ముఖాముఖిలో వెల్లడించారు.



ప్రజాశక్తి: ప్రస్తుతం జూ లో ఎన్ని రకాల జంతువులు ఉన్నాయి?.

అధికారి: ప్రస్తుతం 85 రకాలకు చెందిన వన్యమృగాలు, పక్షులు, పాములు వంటివి 1100 ఉన్నాయి. ప్రతిరోజు జూ సిబ్బంది వాటికి ఏర్పాటు చేసిన నివాస ప్రాంతాల వద్దకు వెళ్లి వాటి స్థితిగతులను పరిశీలించడం జరుగుతుంది. ఏదైనా అనారోగ్యం గుర్తించిన వెంటనే సంబంధిత ప్రాణిని వెటర్నరీ వైద్యులు చేత చికిత్స చేయిస్తాము.

ప్రజాశక్తి: జూ లో సీసీ కెమెరాల పరిరక్షణ ఎలా ఉంది?.

అధికారి: జూ లో గతంలో 60 సీసీ కెమెరాలతో జంతువుల సంరక్షణ కేంద్రాల వద్ద నిఘా ఏర్పాటు చేశాము. కానీ సందర్శకుల రక్షణలో భాగంగా మరిన్ని సీసీ కెమెరాలు అవసరమని గుర్తించి మరో 25 కెమెరాలను అదనంగా జూ లోని వివిధ ప్రాంతాల్లో వాటిని అమర్చడం జరుగుతుంది. జూ లో అమర్చిన సీసీ కెమెరాల వీడియోలను రెండు మానిటరింగ్ గదులను ఏర్పాటు చేసి వాటి ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాము.

ప్రజాశక్తి: వేసవి దృష్ట్యా జంతు సంరక్షణ చర్యలను వివరించండి...?

అధికారి: ఈసారి వేసవిని దృష్టిలో ఉంచుకొని శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో ఉన్న జంతువుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాము. ఎండ వేడి నుండి ఉపసమనం కోసం స్ప్రింక్లర్స్, వట్టివేర్లు కట్టలు, కూలర్స్, సాసర్ ఫీట్స్, కూల్ పెయింట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, గ్రీన్ మ్యాట్స్ వంటివి జంతు సంరక్షణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించాం. అదేవిధంగా జంతువులకు అందించే ఆహారం లోనూ వేసవిలో మార్పులు చేస్తాం. ప్రాణుల శరీర ఉష్ణోగ్రత అదుపులో ఉండడానికి అవసరమైన ఆహారాన్ని అందిస్తాం.

ప్రజాశక్తి: జూ వార్షిక బడ్జెట్ ఎంత?.

అధికారి: జూ నిర్వహణకు ఏడాదికి దాదాపు పది కోట్ల రూపాయల ఖర్చు చేయడం జరుగుతుంది. ఇందులోనే జూ నిర్వహణ, సిబ్బందికి జీతభత్యాలు, విద్యుత్ ఛార్జీలు, జంతువులకు ఇచ్చే ఆహారం వంటివి ఉంటాయి.

ప్రజాశక్తి: సెంట్రల్ జూ అథారిటీ నుండి ఏదైనా నిధులు వస్తాయా?

అధికారి: జూ లో రిస్క్యూ ప్రాణులు నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం రూ.60లక్షలు సెంట్రల్ జూ అథారిటీ వారు అందించడం జరుగుతుంది. వార్షిక బడ్జెట్‌తో కలుపుకొని 10 కోట్ల 60 లక్షలతో జూ నిర్వహణ సాగుతోంది.

ప్రజాశక్తి: నీటి సమస్య ఉందా?.

అధికారి: ప్రస్తుతం జూలో ఎటువంటి నీటి కొరత లేదు. జూ నిర్వహణకు కళ్యాణీ డాం నీటితోపాటు జూ లోపల బోర్లను ఏర్పాటు చేసుకున్నాం. వీటితో జూలో పచ్చదనం నిర్వహణకు, జంతువులకు తగినంత నీటి సదుపాయం ఉంది.

ప్రజాశక్తి: సందర్శకుల రక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టారు..?

అధికారి: గత అనుభవాల దృష్ట్యా సందర్శకుల రక్షణకు మరిన్ని రక్షణ చర్యలను తీసుకుంటున్నాం. అడవితో కలిపి ఉన్న జూ పూర్తిస్థాయి రక్షణ కోసం ఇప్పటికే రెండు మూడు చోట్ల పెద్ద పార్టీ గోడలను నిర్మించాము. రోడ్డు మార్గం వైపు కూడా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాము.



నేడు రంజాన్ మాసం ప్రారంభం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : అంజుమన్ తరఖీ ఉర్దూ చిత్తూరు డిస్టిక్ ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ మాసం ప్రారంభం అవుతున్న సందర్భంగా కాలమాన పట్టికను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజి సయ్యద్ కామాలుల్లా జూహూరి ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఘనీ, డివిజన్ ఖాజి, కార్పొరేటర్లు అను, సయ్యద్ పాల్గొన్నారు. వీరితో పాటుగా కమిటీ సభ్యులు అబ్దుల్ రషీద్,బషీర్ అహమద్,అబ్దుల్ గఫ్ఫార్, గులాం రసూల్, సుల్తాన్,మునీర్ అహమద్, లాయర్ మొహిద్దీన్,ముక్తార్ అహ్మద్ పాల్గొన్నారు.

అధికారిక శిలాఫలకాలపై టిడిపి నాయకుల ఫొటోలు

ఆ నాయకుల పయనం ఎటో?



ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురు కుప్పం గ్రామంలో టిడిపి నాయకుల ఫొటోలు అనూహ్యంగా అధికారిక ప్రభుత్వ శిలాఫలకంపై దర్శనమిచ్చాయి. ఈ పరిణామం పలువురిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలంలో ఆదివారం జరిగే ప్రభుత్వ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకంపై టిడిపికి చెందిన నాయకుల ఫొటోలను ముద్రించారు. వెదురుకుప్పం ఎంపిటిసి రాధిక భర్త పురందర రెడ్డి బంధువు అయిన భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చిరంజీవి రెడ్డిల ఫొటోలను శిలా ఫలకంపై ముద్రించడంతో టిడిపిని వదిలి వైసిపికి వచ్చినట్లు అధికార పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే వీళ్లిద్దరూ టిడిపిలో ఉంటే వాళ్లకు వ్యతిరేకంగా పార్టీకి రాజీనామా చేస్తానని టిడిపి సీనియర్ నాయకుడు అల్టిమేటం జారీ చేయడంతో ఈ విషయం వైరల్ అవుతోంది. మొత్తానికి ఆ ఇద్దరు నాయకుల పయనం ఎటో తేలాల్సి ఉంది.

నేడు ఎంవిఐ కార్యాలయం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్ : నగరి పట్టణంలో మంత్రి ఆర్కేరోజా చొరవతో ఏర్పాటు చేస్తున్న మోటర్ వాహన తనిఖీ అధికారి కార్యాలయం సోమవారం ప్రారంభం కానుంది. మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్ సమీపం ఎస్కేఎన్ కాంపౌండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం మంత్రి ఆర్కేరోజా ప్రారంభిస్తారని ఆర్టీవో వాసుదేశ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ ప్రారంభంతో నగరి ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది.

తుంగలో తొక్కిన సమయపాలన

- ఎస్వీయూలో విధులకు హాజరుకాని సిబ్బంది
- మధ్యాహ్నం అయితే ఆఫీసుల్లో కనిపించని అధికారులు
- నిర్లక్ష్యపు అధికారులపై పూర్తిస్థాయి చర్యలు ఎక్కడ ..?

ప్రజాశక్తి -ఎస్వియు క్యాంపస్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాలేదని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అకాడమిక్, ఫైనాన్స్ విభాగాల్లో, కొన్ని శాఖావిభాగాలలో బోధన, బోధనేతర సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాలేదని తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా పరిపాలన భవనంలోని జీతాలను విడుదల చేసే ఫైనాన్షియల్ ఆఫీసర్ మధ్యాహ్న సమయంలో అసలు విధులకు హాజరు కారని అపవాదు ఉంది. బోధన, టైం స్కేల్, ఎన్ఎంఆర్, శాశ్వత ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందాలి అంటే ఫైనాన్షియల్ ఆఫీసర్ సమయపాలన కచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో ఉద్యోగులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని విద్యార్థి, ఉద్యోగ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. అయితే పరిపాలన భవనం కొన్ని విభాగాలలో ముఖ్యంగా ఇంజనీరింగ్ విభాగాలలో బోధన, బోధనేతర సిబ్బంది మధ్యాహ్న సమయాల్లో అసలు విధులకు హాజరు కాలేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల అంటే ప్రపంచంలోనే ప్రత్యేకమైన స్థానం కలిగి ఉందని గత ఐదు సంవత్సరాలుగా సరైన అధ్యాపకులు లేక, అధ్యాపకులు సమయం పాలన పాటించక దాని ప్రతిష్ట కనుమరుగవుతుందని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. వర్సిటీలోని వివిధ కళాశాల సముదాయాలలో, వసతి గృహాలలో సరైన శానిటేషన్, మురుగునీటి కాలువ విధానం పూర్తిగా అడుగంటు పోయిందని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న అధికారులు వివిధ విభాగాల పర్యవేక్షణ ద్వారా విధులకు హాజరు కాని సిబ్బందిపై పూర్తిస్థాయిలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటే తప్ప వర్సిటీని అభివృద్ధి పథంలో తీసుకునేందుకు సాధ్యం కాదని మేధావులు, ఆచార్యులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమయపాలన పాటించని అధికారులు అధ్యాపకులపై కొరడా ఝులిపిస్తారని ఆశిద్దాం. నిత్యం పరిపాలన భవనానికి కొన్ని వందల సంఖ్యలో విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవడానికి వస్తుంటారు. వాటి జిరాక్స్, నకలు తీసుకోవడానికి కనీసం వర్సిటీలో జిరాక్స్ సెంటర్ ఒకటి కూడా లేకపోవడం దారుణమని విద్యార్థి సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో సర్టిఫికెట్ కోసం వివిధ రకాలుగా వివిధ వర్గాలుగా విద్యార్థులను అనేకవిధాలుగా ఇబ్బంది పెట్టి డబ్బులు తీసుకునేందుకు ప్రస్తుత విసి అక్రమాలకు అడ్డుకట్ట వేసి, ఆన్లైన్ కంప్యూటర్ లో చలానా పద్ధతిని తీసుకురావడం పట్ల విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తిరుపతిలో సైకిల్ గుర్తు కనపడదు..

- 41 ఏళ్ల తర్వాత పోటీ నుంచి తప్పుకున్న టిడిపి..!
- జనసేనలోకి వలసలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతిలో టిడిపి గుర్తు సైకిల్ కనపడదు.. ఇటు తిరుపతి అసెంబ్లీలోనూ తిరుపతి పార్లమెంటు లోనూ సైకిల్ బొమ్మ ఉండదు. బిజెపి, జనసేన, టిడిపి పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు.. తిరుపతి పార్లమెంటులో ఈ స్థానాన్ని బిజెపికి కేటాయించారు. రెండు చోట్ల టిడిపి అభ్యర్థులు నామినేషన్ వేయనందున ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తు కనపడదు. 1983లో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత టిడిపి అధికారులకు వచ్చింది. ఎన్టీ రామారావు సెంటిమెంట్‌గా తిరుపతి, గుడివాడలో పోటీ చేసి రెండు చోట్ల గెలుపొందారు. తిరుపతి స్థానానికి రాజీనామా చేసి గుడివాడ ఉంచుకుని ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఉప ఎన్నికల్లో కత్తుల శ్యామలమ్మ పోటీ చేసి విజయం సాధించారు.

1989లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మబ్బు రామిరెడ్డి ఉన్నారు. 1994లో ఆవుల మోహన్ ఎమ్మెల్యేగా టిడిపి నుంచి విజయ బావుట ఎగరవేశారు. 1999లో చదలవాడ కృష్ణమూర్తి కాంగ్రెస్ పై పోటీ చేసి అసెంబ్లీకి వెళ్లారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.వెంకట రమణతో పోటీపడి ఎన్‌వి.ప్రసాద్ టిడిపి అభ్యర్థి ఓడిపోయారు. 2009లో కొణిదెల చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించి పాలకొల్లు, తిరుపతి నుంచి పోటీచేసి గెలుపొందారు. పాలకొల్లులో ఓడిపోయారు. 2012 మధ్యంతర ఎన్నికల్లో వైసీపీ నుంచి భూమన కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిడిపి అభ్యర్థి చదలవాడ కృష్ణమూర్తి మూడో స్థానంలో నిలిచారు. 2014 ఎన్నికల్లో టిడిపి నుంచి ఎం వెంకటరమణ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన మరణాంతరం మధ్యంతర ఎన్నికల్లో ఆయన సతీమణి సుగుణమ్మ టిడిపి నుంచి పోటీ చేసి అసెంబ్లీకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో టిడిపి నుంచి సుగుణమ్మ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 700 చిల్లర ఓట్ల తేడాతో ఆమె ఓడిపోయి భూమన కరుణాకర్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేనలు ఒకే కూటమిగా నిలిచాయి. పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ జనసేనకు, తిరుపతి పార్లమెంటు బిజెపికి కేటాయింపులు దాదాపు జరిగిపోయాయి.. ఇక అధికార ప్రకటన తరువాయి.. టిడిపి 41 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా తిరుపతి అసెంబ్లీ పోటీ నుంచి తప్పుకుంటుంది. 1999లో టిడిపి బిజెపి పొత్తుల భాగంగా అప్పుడు తిరుపతి పార్లమెంటుకు బిజెపి కేటాయించారు. తిరుపతి ఎంపీగా బిజెపి అభ్యర్థిగా గెలుపొందారు.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు తెలుగు అసెంబ్లీ ఈవీఎంలో సైకిల్ గుర్తు కనిపించదు



జనసేనలోకి వలసలు

తిరుపతిలో టిడిపి ఖాళీ అవుతుందన్న ప్రచారం జరుగుతోంది... ప్రస్తుత రాజకీయ పరిణామాలు చూస్తే అలానే అనిపిస్తోంది... టిడిపి తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి సుగుణమ్మ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి జనసేనలో టికెట్ ఇస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటించారు. మరోవైపు టిడిపి నేతలు వూకా విజయ్ కుమార్, జెబీ శ్రీనివాస్‌లు కూడా జనసేన వైపు చూస్తున్నారు.. తమకు పవన్ కళ్యాణ్ టిక్కెట్ ఇస్తే గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు నరసింహ యాదవ్‌కి టికెట్ రాకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు.. తిరుపతిలో బీసీలు ఎక్కువగా ఉన్నారని..తనకే టికెట్ ఇవ్వాలని పట్టుబడి మరీ కూర్చున్నారు.. టిడిపి క్యాడర్ దుంపూరు భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, శంకర్ నారాయణ తదితరులు సుగుణమ్మ దారే మాదారి అంటున్నారు..

తిరుపతిలో టిడిపిలోని ప్రధాన నాయకత్వం జనసేన వైపు వలసలు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.. తిరుపతిలో టిడిపి గెలిస్తే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంటూ.. ఇది... ఇక వైసిపి అభ్యర్థి భూమన అభినయ్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు.. 25 ఏళ్ల ముందే అభివృద్ధి తమ ప్రభుత్వం చేశామని తమకు ఓటు వేయండి అని ప్రచారం చేస్తున్నారు.. ఎంత ఖర్చు అయినా సరే ఓటర్లను ప్రలోభాలు పెట్టేందుకు వైసీపీ సిద్ధమవుతుంది.. అయితే బిజెపి, జనసేన, టిడిపి కూటములు ఇంతవరకు అభ్యర్థులను ప్రకటించ లేదు.. తిరుపతి అసెంబ్లీ జనసేనకు, తిరుపతి పార్లమెంటు బిజెపికి కేటాయిస్తే తిరుపతిలో టిడిపికి భవిష్యత్తు ఉండదని రాజకీయ విశ్లేషకుల భావన.. పొత్తు నేపథ్యంలో చేతులారా టిడిపి తిరుపతిని కోల్పోనుంది..

వ్యక్తికి కత్తిపోట్లు

ప్రజాశక్తి-పులిచెర్ల: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురి కావడంతో ఆ నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లికి చెందిన రషీద్, మహమ్మద్ షరీఫ్ మధ్య శుక్రవారం రాత్రి కొంత వివాదం జరిగింది. ఇదే గ్రామానికి చెందిన బారేషా(31) శనివారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న మహమ్మద్ షరీఫ్ ను రషీద్‌తో ఎందుకు గొడవ పడ్డావని అడిగాడు. ఈ నేపథ్యంలో మహమ్మద్ షరీఫ్ తన వద్ద ఉన్న చాకుతో బారేషా కడుపుపై కత్తితో దాడిచేసి పారిపోయాడు. దీంతో తీవ్ర గాయాలైన బారేషాను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేంద్ర బలగాలతో కవాతు

ప్రజాశక్తి - పలమనేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు స్థానిక పోలీసు శాఖ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలమనేరులో ఆదివారం సంయుక్తంగా కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంట్లో భాగంగా ఎన్నికల సంఘం వారు పంపించిన కేంద్ర బలగాలు పలమనేరుకు వచ్చి ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరాయి.

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రం నగరిలో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని ఓంశక్తి ఆలయ సర్కిల్ నుంచి బస్టాండు వరకు అనంతరం పళ్లిపట్టు రోడ్డు, నాగలాపురం రోడ్డులో కవాతు నిర్వహించారు. కవాతు ముగింపులో బస్టాండు ప్రాంగణంలో డీఎస్పీ నరసింహ మూర్తి మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికలు జరిగేలా ప్రజల సహకరించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తున్నందున ఎన్నికల నియమావళి పట్ల పౌరులు అవగాహన కలిగివుండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదన్నారు. ఎన్నికల నియమావళి మేరకు కార్యక్రమం చేసినా పోలీసుల వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. నియమావళిలో ఎలా నడుచుకోవాలో ప్రజలకు ప్రత్యక్షంగా తెలపడానికే కవాతు నిర్వహించామన్నారు. ఈ కవాతులోఅసిస్టెంట్ కమాండెంట్ బీనిత్, ఎస్ఎస్‌బి సీఐ వర్మ, సీఐ సురేష్, ఎస్ఐ వెంకటనారాయణ పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నగరంలో ఈ నెల 12 వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న టిడిపి బహిరంగ సభకు పూజ చేసి సభ ఏర్పాట్లను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ళ హేమాద్రి నాయుడు వరలక్ష్మి జయరాజ్, చిట్టిబాబు నాయుడు, నందగోపాల్, నరేష్ సాయిరాం, బాలాజీ నాయుడు , ఆనంద నాయుడు, జానకిపతి నాయుడు పాల్గొన్నారు.

అమరనాథరెడ్డిని విమర్శించే అర్హత వైసిపికి లేదు: టిడిపి

ప్రజాశక్తి - రామకుప్పం: మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని విమర్శించే అర్హత వైసిపి నేతలకు లేదని రామకుప్పం టిడిపి నేతలు తెలిపారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అమర్నాథ్ రెడ్డి కానీ ఆయన తండ్రి రామకృష్ణ రెడ్డి కానీ నిష్కళంకమైన రాజకీయాలు చేశారే తప్ప ఎన్నడు అవినీతి, అక్రమాలు, బెదిరింపులకు పాల్పడలేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఆయనపై చేసిన విమర్శలు హాస్యాస్పదమన్నారు. పెద్దిరెడ్డి కుట్రపూరిత రాజకీయాలకు కాలం చెల్లిందని వారు తెలిపారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమి సృష్టించే సునామీలో రాష్ట్రవ్యాప్తంగా వైసిపి తో పాటు జిల్లాలో పెద్దిరెడ్డి కుట్రపూరిత రాజకీయాలు కూడా కొట్టుకుపోతాయన్నారు. అమర్నాథ్ రెడ్డి పై విమర్శలు చేసే స్థాయి ఎమ్మెల్సీ భరత్ కు లేదన్నారు. ఎన్నికల అనంతరం ఆయన హైదరాబాద్ కు వెళ్లేందుకు సిద్ధం కావాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి,నరసింహులు, పత్రా నారాయణ,రామమూర్తి, రామకృష్ణప్ప, జయశంకర్, మనోహర్, కామరాజ్ నాయక్, సత్య, రఫీ పాల్గొన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని బగళనత్తం, రామకుప్పం, మిట్టపల్లి గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. టిడిపి పథకాలను ప్రచారం చేశారు. మహిళలకు జిల్లాలో ఉచిత ప్రయాణం, మూడు సిలిండర్లు , అమ్మకు వందనం, రైతు 20 వేల ఆర్థిక సాయం వివరించారు. గతంలో చేసిన అభివృద్ధి సంక్షేమాలను గుర్తు చేశారు. గడిచిన నాలుగున్నర సంవత్సర పాలంలో అభివృద్ధి ఆమడ దూరంలో వైసిపి ప్రభుత్వం ఉందన్నారు. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు లక్ష కోట్ల మెజార్టీ లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీతాపతి నందా రెడ్డి గంట్లరెడ్డి, సుబ్రి, బాలరాజు, సతీష్, అమర్, ఆదిల్, శ్రీనాథ్ రెడ్డి, మంజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: సంక్షేమం టిడిపితోనే సాధ్యమవుతుందని జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని నెల్లెపల్లి గ్రామంలో మహిళలతో కలిసి జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు చిత్రానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు వర్గాలకు సంక్షేమం అందాలంటే టిడిపి తోనే సాధ్యమౌతుందన్నారు. బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వడం, బీసీ డిక్లరేషన్ చేయడం బీసీలకు ఎంతగానో అభివృద్ధి చెందాతారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వరదరాజులు ,వెంకటేష్ ,మహేష్, నరసింహులు, ధనుంజయులు, శాంతి ,మమత, జ్యోతి, సుబ్రహ్మణ్యం, తెలుగు మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ముస్లిం మైనార్టీల సంక్షేమమే జగన్ ముఖ్య ఉద్దేశం'

ప్రజాశక్తి - బంగారు పాళ్యం: ముస్లిం మైనార్టీల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సాధ్యమైందని పూతలపట్టు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అరగొండ రోడ్డులోని ఎస్ఎల్వీ కళ్యాణ మండపం సమీపంలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం కో ఆప్షన్ మెంబర్ ఫిరోజ్ అహ్మద్ ముత్యలపల్లి నూర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రారంభించారని, షాది మహల్ నిర్మాణానికి 50 లక్షల మంజూరు చేశారని రాబోవు ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలు వైసిపి విజయానికి తోడ్పడాలన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీలు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, జెడ్పిటిసి సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు దత్తు రెడ్డి, ఎఎంసి ఉపాధ్యక్షులు సర్దార్, పలువురు మైనార్టీలు, నాయకులు పాల్గొన్నారు.

కనకదాస విగ్రహావిష్కరణ


కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రం శివార్లలోని బందార్లపల్లి క్రాస్ వద్ద కురుబ కులస్థుల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహం, స్వాతంత్ర సమర యోధుడు సంగొళి రాయన్న విగ్రహాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కనకదాస విగ్రహం ఆవిష్కరించడం చాలా సంతోషమన్నారు. వైసిపి ప్రభుత్వంలో కురుబ కులస్తులను అన్ని విధాల ఆదుకుంటున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా భరత్ ను, చిత్తూరు జిల్లా ఎంపీగా రెడ్డప్ప ను కురుబ కులస్తులు ఆదరించి వైసిపి విజయానికి కృషి చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ విద్యాసాగర్, పరిశీలకులు రెడ్డప్ప, సీనియర్ నేత ఆరేళ్ల జయప్ప,ఎంపీపీ సుబ్రహ్మణ్యం ,జెడ్పిటిసి నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఫోటో రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ


ఫోటో రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీలో జగనన్న లేఅవుట్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించి ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసిందని ఆ ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ కూడా చేసి పంపిణీ చేసినట్లు జడ్పిటిసి అమాస కుసుమ మోహన్ తెలిపారు. ఆదివారం నెల్లిమంద సచివాలయంలో పలువురు జగనన్న లేఅవుట్ లో ఇళ్ల స్థలాలు పొందిన

తక్కన కుంటలో వ్యర్థాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: తక్కన కుంటను వ్యర్థాలతో నింపేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తి చేస్తున్నారు. మండల కేంద్రంలోని తగ్గువారి పల్లి పంచాయతీ నాలుగు రోడ్ల కూడలి నుండి మండల కార్యాలయాలకు వెళ్లేదారిలోని రోడ్డు పక్కన కుంటను పలువురు వ్యర్థాలతో నింపేస్తున్నారు. ఈ కుంటను ప్రజలు తాగునీరు, సాగునీరు కోసం ఉపయోగించే వారు. క్రమేపి గ్రామం విస్తరించడంతో వ్యర్థాలను నింపడంతో చిన్న కుంటగా మారింది. గ్రామంలో చెత్తాచెదారాన్ని నింపేస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంతో వ్యర్థాలను వేసే వాళ్లు ఇష్టరాజ్యంగా నింపేస్తున్నారు. క్రమేపి కుంటను మట్టితో నింపేసి దురాక్రమణకు గురి చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి కుంట విస్తీర్ణాన్ని సర్వే చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని పలువురు ప్రజలు వాపోతున్నారు.


వ్యర్థాలతో నిండిపోతున్న తక్కన కుంట

మేధావులుగా తీర్చిదిద్దడానికే ఇన్‌స్పైర్: ఎంఈవో

ప్రజాశక్తి -గంగవరం: బాల మేధావులను భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి, విద్యార్థుల్లోని సృజనాత్మకత, శాస్త్రీయ పరిశీలనాశక్తి, వినూత్న ఆలోచన ఒక సమస్యకు పరిష్కారం చూపిస్తుందని, దీనికి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్ట్ కాంపిటీషన్స్ వేదికగా నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బాల మేధావుల మెరిసిన ఆలోచన, విరిసిన సృజనాత్మకతల కలయికే ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్ట్ కాంపిటీషన్స్ అన్నారు. ఈనెల 11వ తేదీ నుండి నుంచి 13వ తేదీ వరకు గంగవరం మండలంలోని మదర్ థెరీసా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ఆదివారం హైస్కూల్ గంగవరం పాఠశాలలో చిత్తూరు డిఈఓ దేవరాజులు ఆధ్వర్యంలో చిత్తూరు డివైఈవో చంద్రశేఖర్, వివిధ మండల ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించేందుకు డీఈఓ పలు సూచనలు ఇచ్చారు. డిఎస్ఓ రమణ వివిధ కమిటీలు నిర్వహించాల్సిన విధులు గురించి ఈ సమావేశంలో వివరించారు. వివిధ మండలాల ఎంఈఓలు, అనుభవజ్ఞులు అయిన హెడ్మాస్టర్లు , ఎక్స్ డిఎస్ఓలు పలు సూచనలు చేశారు. ఈ 11వ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారులు, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఢిల్లీ నుండి అబ్జర్వర్సు పాల్గొంటారని, ఇన్‌స్పైర్ మనక్ స్టేట్ ఎగ్జిబిషన్‌కు 26 కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి వెదురుకుప్పం వరకు బీటీ రోడ్డు పనులకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం స్థానిక ఎంపీటీసీ రాధిక పురంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంను వారు ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షల అంచనాతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, స్థానిక సర్పంచ్ శిల్ప, మాజీ సర్పంచ్ చిరంజీవి, ఆర్కే ఫిల్లింగ్ స్టేషన్ అధిపతి పురంధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మావతి, మాజీ మండల అధ్యక్షులు పేట ధనుంజయ రెడ్డి, నాయకులు కోలారు ప్రకాష్, మాంబేడు మాజీ ఎంపీటీసీ బండి రోషి రెడ్డి పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే అభ్యర్థిని ఆదరించండి: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వైయస్సార్ ప్రభుత్వం ఈ సారి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మిని ఆదరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని డిసిసి బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎం ప్రారంభోత్సవానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. తిరుపతి నుంచి పచ్చికాపల్లం మీదుగా ఆదివారం వెదురుకుప్పంకు చేరుకున్నారు. ఆయనకు పచ్చికాపల్లంలో మండల నాయకులు భారీగా స్వాగతం పలికారు. దారి పొడవునా పూల వర్షం కురిపించారు. శాలువా కప్పి పుష్పగుచ్చం అందించి ఒకరు ఒకరి వెంట చేసుకున్నారు. అనంతరం అక్కడ నుంచి స్కూటర్ ర్యాలీతో వెదురుకుప్పం చేరుకొని ఏటీఎంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం ఈసారి డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె అయిన కృపాలక్ష్మికి గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆమెకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిసిసి బ్యాంక్ ఛైర్మన్ రెడ్డమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు కామసాని పద్మనాభ రెడ్డి, జడ్పిటిసి సుకుమార్, ఎంపీపీ బండి నాగరాణి, మండల గృహ నిర్మాణ సారధుల కన్వీనర్ బట్టి సుబ్రహ్మణ్యం, స్థానిక సర్పంచి శిల్ప, స్థానిక ఎంపీటీసీ రాధిక పురంధర్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పేట ధనుంజయ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బండి రోసి రెడ్డి, మాంబేడు ఎంపీటీసీ గుణశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మన సంస్కృతి కళా సంస్థ పాటల పోటీలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో మన సంస్కృతి కళాసంస్థ (తిరుపతి) చిత్తూరు వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాభ్యుదయం, అభ్యుదయ పాటల కార్యక్రమం ప్రముఖ రచయిత్రి ఎంఆర్ అరుణ కుమారి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. మహిళా అభ్యుదయమే సమాజ అభ్యుదయం అని మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి సరైన ఆరోగ్య వాతావరణం పాలకులు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వల్లేరు హరినాయుడు, ఆత్మీయ అతిథులుగా శైలజ , శ్యామలాదేవి, గౌరవ అతిథులు , అమ్మఒడి పద్మనాభ నాయుడు, సీఎన్ చంద్రశేఖర్ విశిష్ట అతిథి ఎం త్యాగరాజు నాయుడు హాజరయ్యారు. మహిళా అభివృద్ధే సమాజ అభివృద్ధి అని ఇంటి బాధ్యతల నుండి ఇంటి బయట వివిధ రంగాలలో తమ బాధ్యతలను ఆంకిత భావంతో పనిచేస్తూ రాణిస్తున్నారన్నారు. వారు మరింత రాణించడానికి అన్ని వర్గాల నుండి సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత అటు పాలకపక్షాలపై, ఇటు సమాజం పై వుందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన మహిళా మణులు 17 మందిని శాలువాలు, జ్ఞాపికలతో మన సంస్కృతి కళా సంస్థ అధ్యక్ష , కార్యదర్శులు రంగాని సహదేవ నాయుడు కలకట రెడ్డెప్ప ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.


మాట్లాడుతున్న ప్రముఖ రచయిత్రి ఎంఆర్ అరుణకుమారి

13న సంత బహిరంగ వేలం

ప్రజాశక్తి -శాంతిపురం : జిల్లాలో అతిపెద్ద సంతగా పేరుపొందిన కెనమాకులపల్లి పంచాయతీలోని బడుగుమాకులపల్లి వారపు సంతకు ఈనెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు కెనమాకులపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు ఆ పంచాయతీ సర్పంచ్ ఏవి జయరాం, పంచాయతీ కార్యదర్శి జి అశ్వత్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కెనమాకులపల్లి పంచాయతీకి సంబంధించిన బడుగుమాకులపల్లి వారపు సంత (అంగళ్లు), పశువుల సంత, ఆటో స్టాండ్, గొర్రెలు కోళ్ల వారపు సంతకు వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు నోటిఫికేషన్ నిబంధనలకు లోబడి తమ ధరావత్తును 'పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ కెనమాకులపల్లి పేరున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆరిముత్తనపల్లి శాఖలో చెల్లుబాటు అయ్యేలా డిపాజిట్లు చెల్లించి తహశీల్దారు వద్ద జారీ చేసిని సాల్వెన్సీ సమర్పించాలన్నారు. ఇందులో భాగంగా బహిరంగ వేలంలో పాల్గొనే వారు తమ డిపాజిట్లను నగదు, డిడి రూపంలో చెల్లించాలని కోరారు. వారపు సంత, అంగళ్ళ కోసం రెండు లక్షల రూపాయలు సాల్వెన్సీ లేకుంటే రూ.3 లక్షలు డిపాజిట్‌గా నిర్ణయించారు. పశువుల సంత(ఆవుపేడతో సహా) 2 లక్షల రూపాయలు సాల్వెన్సీ లేకుంటే రూ.3లక్షలు డిపాజిట్ గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆటోలు ప్రైవేటు వాహనాలకు గ్రామపంచాయతీ పరిధిలోని రుసుముల వసూలు కోసం రూ. రెండు లక్షలు నగదు చెల్లించాలని సాల్వెన్సీ లేకుంటే రూ.3 లక్షల డిపాజిట్ చేయాలని తెలిపారు. గొర్రెలు కోళ్ల కోసం నగదు రూపంలో రెండు లక్షలు సాల్వెన్సీ లేకుంటే రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి వారపు సంత బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఇతర వివరాలకు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని తెలిపారు.

వన్నెకుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : తిరుపతి– బెంగళూరు బైపాస్ రోడ్డు సమీపంలోని స్థానిక చెర్లోపల్లి పరిసర ప్రాంతంలో రెండెకరాల ప్రభుత్వ స్థలంలో వన్నెకుల క్షత్రియుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి చిత్తూరు నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి ఎంసి విజయానంద రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంలో అత్యధిక శాతం ఉన్న వన్నెకుల క్షత్రియులపై గత పాలకులు, ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపాయన్నారు. వైసిపి ప్రభుత్వం వన్నెకుల క్షత్రియుల చిరకాల వాంఛ అయిన కమ్యూనిటీ భవన నిర్మాణానికి రెండెకరాల భూమిని కేటాయించడంతో పాటు పూర్తి ఆర్థిక సాయం అందిస్తానని తెలిపారు. ప్రారంభ దశకు 20 లక్షల రూపాయలను వన్నె కుల క్షత్రియుల సంఘం జిల్లా అధ్యక్షులు కాశీ నాయకర్‌కు అందించారు. ఈ సందర్భంగా వన్నెకుల క్షత్రియుల సంఘం కాశీ నాయకర్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తమకు వన్నె కుల క్షత్రియుల కమ్యూనిటీ హాలుకు రెండు ఎకరాల భూమిని కేటాయించడం ఎంతో హర్షంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సంతోష్ కుమార్, శశి కుమార్ సంఘ నాయకులు విజయకుమార్, తిరుమల బేకరీ యజమాని కన్నన్ పాల్గొన్నారు.


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంసీ విజయానంద రెడ్డి

డిప్యూటీ సీఎం మాట ఇచ్చి మరిచారు..

- ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడు సార్లు ప్రయత్నించా నాయకులు పట్టించుకోలేదు..
- మాజీ సర్పంచ్ కొత్తపల్లి మణి ఆవేదన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :

తను ఎంతో కాలం నుంచి రాజకీయాల్లో వున్నానని అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వున్న రోజుల్లో జిడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి యత్నించానని ఆయన అర్థాంతరంగా మరణించారని, ఆ తర్వాత జగన్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత ఆ పార్టీలో చేరి అభివృద్ధికి బాగా కృషి చేశానని 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం యత్నించగా ప్రస్తుత డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తనకు టికెట్ ఇవ్వాలని అడ్డుపడ్డారని తనకు అవకాశం ఇవ్వాలని తను గెలిస్తే క్యాబినెట్ హోదా కలిగిన పదవి ఇప్పిస్తానని మాట ఇచ్చారని ఆ తర్వాత తనతో కనీసం మాట్లాడను కూడా లేదని, ప్రస్తుత నాయకులు ఎవరూ తనను పట్టించుకోవడంలేదని మాజీ సర్పంచ్ కొత్తపల్లి మణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న రోజుల్లో తనకు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే కొద్ది రోజులకే ఆయన మరణించారన్నారు. ఆ తర్వాత పరిణామాల్లో వైఎస్ జగన్ పార్టీ ప్రారంభించిన అనంతరం ఆ పార్టీలో చేరి 2014లో జిడి నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ ఆశించానని అదే సమయంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వచ్చి తనకు సీటు వదిలేస్తే క్యాబినెట్ హోదా కలిగిన పదవి ఇప్పిస్తానని మాట ఇచ్చారని ఆ తర్వాత మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను 1995– 2000 సంవత్సరంలో కటిక పల్లి గ్రామ సర్పంచ్ గా సేవ చేశానని అప్పటి ప్రభుత్వం నుంచి ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నానని తెలిపారు. ఆ తర్వాత వైసిపి అభివృద్ధికి ఎంతో కృషి చేసినా తనకు న్యాయం చేయలేదన్నారు. నారాయణ స్వామికి జిడి నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పుడు ఎస్ఆర్‌పురంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంసీ విజయనందరెడ్డి లను ఆహ్వానించి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశానని గుర్తు తెచ్చుకున్నారు. వైసిపి కోసం మండలంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టానని, తన ఎదుగుదలను చూసి తమ ఎస్‌సి సామాజిక వర్గం వారు కొంతమంది ఓర్చుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆవేదనను ముఖ్య నేతలు, నాయకులు ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన అనుచరులతో సమావేశమై తదుపరి కార్యాచరణ రూపొందిస్తానని పార్టీలో తగిన గుర్తింపు లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటు హక్కుపై అవగాహన



బాహుబలి సెట్‌తో సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: యువతలో ఓటు హక్కు పై అవగాహన పెంచడం, 18 సంవత్స రాలు నిండిన వారు తప్పని సరిగా ఓటు హక్కు నమోదు చేసుకో వడం, ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలనే అంశంపై ఏఈఆర్వో, కమిషనర్ డా. జె అరుణ ఆధ్వర్యంలో చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈసీఐ, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ (ఎస్‌విఇఇపి) కార్యక్రమాల్లో భాగంగా యువ ఓటర్లు ఎక్కువగా ఉండే ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో బాహుబలి సెల్ఫీ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఓటర్ గుర్తింపు కార్డును భుజాలపై ఎత్తుకున్న బాహుబలి సెల్ఫీ కటౌట్లు యువతను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. యువత ఉత్సాహంగా సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ తాము తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని చెప్తున్నారు. తొలి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్తున్నారు.

గజ వాహనంపై శివపార్వతుల విహారం


గజ వాహనంపై విహరిస్తున్న శివపార్వతులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గజ వాహనంపై శివపార్వతులు ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. మహా శివరాత్రి బ్రహ్మోత్స వాల్లో ఆరవ రోజు ఆదివారం ఉదయం గజవాహనంపై శివపార్వతులు భక్తులకు దర్శన మిచ్చారు. మండలంలోని మొగలి వారి పల్లికి చెందిన నందా, గాంధీ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. శనివారం రాత్రి శేష వాహనంపై శివపార్వతులు భక్తులకు కనువిందు చేశారు. కొండేటూరు రంగనాథ నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహ రించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి మునిరాజులు, పలువురు ఉభయ దారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్ వద్ద స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన రాష్ట్ర భూగర్భ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని రామకుప్పంలో ఏర్పాటు చేసేందుకు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ముందుకు వచ్చారు. త్వరలో విగ్రహ ఏర్పాట్లకు చర్యలు తీసుకుని ప్రతిష్టించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ బాబు రెడ్డి, నేతలు చంద్రారెడ్డి, కేశవరెడ్డి , చంద్రమోహన్ రెడ్డి, చెంగారెడ్డి,పాపిరెడ్డి, మంజునాథ్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

అభివృద్ధి చేయకుంటే రాజకీయాల నుంచి తప్పకుంటా..

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మునుస్వామి థామస్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయకుంటే తాను రాజకీయాలనుంచి తప్పుకుంటానని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ అన్నారు. మండలంలోని బొమ్మయ్యపల్లె, రామకృష్ణాపురం, చిన్న బొమ్మయ్యపల్లె గ్రామాలలో 'మన ఇంటికి మన థామస్'ను తెలుగు తమ్ముళ్లు ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మునుస్వామి థామస్ హాజరయ్యారు. ప్రతి ఒక గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి ప్రభుత్వం వస్తే రాష్ట్రానికి జరిగే మంచిని గురించి ప్రజలకు వివరించారు. అనంతరం జనసేన, టిడిపి సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి జనసేన, టిడివి, బిజెపి కలిసికట్టుగా ముందుకెళ తాయన్నారు. ఆంధ్రాలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రం ఎంతో వెనుకపడి పోయిందన్నారు. నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఓటర్లు అభిప్రాయం గమనిస్తే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అర్థమైందన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉందని, గతలో ఒక పర్యాయం ఎమ్మెల్యే, పర్యాయాలు డిప్యూటీ సీఎం గా ఉన్న నారాయణస్వామి ఇక్కడ ప్రాతినిధ్యం వహించి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఇక్కడ అభివృద్ధి అంటే ఏమిటో తనకు కనిపించలేదని తెలిపారు. తనకు ఒక సారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. కార్వేటినగరం మండలంలో జడ్పిటిసి బిసి కి టికెట్ ఖరారు అయింది. డిప్యూటీ సీఎం భార్యకు జడ్పిటిసి పదవి కట్టబెట్టాలని ఉద్దేశంతోనే మళ్లీ ఆ జడ్పిటిసి స్థానాన్ని ఎస్సీ రిజర్వేషన్ స్థానంగా చేసి తన భార్యకు జడ్పిటిసి కట్టబెట్టిన ఘనత ఆయనదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు కామసాని లోకనాథ రడ్డి, తిరుపతి టిడిపి పరిశీలకులు భీమనేని చిట్టిబాబు నాయుడు, ఎన్నారై మీడియా కోఆర్డినేటర్ గురుశాల కిషన్ చంద్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి, మాజీ సర్పంచ్ సంఘ అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్, గొడుగుచింత మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు, జనసేన పార్టీ నాయకులు పొన్న యుగంధర్, ఈశ్వర్ రెడ్డి, టిడిపి నాయకులు చంగల్ రాయల్ రెడ్డి, విశ్వనాథ యాదవ్, ఈశ్వర్ రెడ్డి, మోహన్ యాదవ్ పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు